సాక్షి
ప్రకాశం
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



పేదల అభ్యున్నతే లక్ష్యం

అణగారిన వర్గాల అభ్యున్నతే ఐక్యతా విజయపథం యాత్ర లక్ష్యమని రిటైర్డ్ ఐఏఎస్ జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ అన్నారు.

- 8లో..



ఎస్పీ స్పందనకు 121 ఫిర్యాదులు

ఎస్పీ మలికాగర్గ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు జిల్లా నలుమూలల నుంచి 121 ఫిర్యాదులు వచ్చాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36.1/27.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నేడు పోస్టల్ శాఖ 'జనంలోకి మనం'

ఒంగోలు సెంట్రల్: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'జనంలోకి మనం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకాశం తపాలా డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ హరి ప్రసాద్ శర్మ తెలిపారు. పోస్టల్ శాఖ విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్ జీ శివ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పర్యవేక్షకులు హరి ప్రసాద్‌శర్మ కోరారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధ, గురువారాల్లో ఒంగోలులో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 3 గంటలకు ప్రకాశం భవనంలోని స్పందన మందిరంలో జరిగే దిశ కమిటీ సమావేశానికి హాజరవుతారు. 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక దక్షిణ బైపాస్ వద్ద ఉన్న పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు.

క్రీడా పరికరాలను భద్రంగా ఉంచాలి

● కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశం



క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: నవంబర్ 15 నుంచి డిసెంబర్ 21 వరకు నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు సంబంధించిన క్రీడా పరికరాలను భద్రంగా ఉంచాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన స్పోర్ట్స్ అథారిటీ నుంచి జిల్లాకు వచ్చిన క్రీడా పరికరాలను పరిశీలించారు. క్రీడా పరికరాలను గ్రామాలు, మండలాలకు చేరేంత వరకు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రీడా పరికరాలు అందుకున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు శాప్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర ఐదు విభాగాల్లో నిర్వహిస్తారని, 15 ఏళ్ల వయసు పైబడిన క్రీడాకారులంతా అర్హులే అని చెప్పారు. ఆ పైబడిన వారికి వయసుతో సంబంధం లేదన్నారు. ఆసక్తి కలిగిన వారు సచివాలయం పరిధిలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడా పరికరాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. బేసిక్ కిట్లు, ప్రొఫెషనల్ కిట్లు పూర్తి నాణ్యత ప్రమాణాలు కలిగిన క్రీడా పరికరాలను ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో స్టెప్ సీఈఓ ఎంవీఎస్ లోకేశ్వరరావు, చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం

ఒంగోలు అర్బన్: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళశారం ఉదయం 10గంటలకు ప్రకాశంభవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కమిటీ సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

సిరుల సుగంధం

ఒక వైపు సంప్రదాయ పంటలను సాగుచేస్తూనే మరో వైపు నూతన పంటల వైపు దృష్టిసారిస్తున్నారు రైతులు. సంప్రదాయ పంటలు, ఆహార పంటలు, నూనెగింజల పంటలు, పండ్ల తోటలతో పాటు పత్తి, పొగాకు పంటల సాగు జిల్లాలో విస్తృతంగా చేపడుతున్నారు. అయితే తాజాగా అధిక ఆదాయాన్నిచ్చే సుగంధ పంటలవైపు ఆసక్తి చూపిస్తున్నారు. వీటి సాగుకు ప్రభుత్వాలు సైతం ప్రోత్సహిస్తుండడంతో ఉత్సాహవంతులైన రైతులు వీటిని సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు.

- జిల్లాలో సుగంధ పంటల వైపు రైతుల చూపు
- లెమన్‌గ్రాస్, పామ్‌రోసా, వట్టివేరు పంటల సాగు
- అరోమా మిషన్ ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్న వైనం
- జిల్లాలో కొత్తగా 128 ఎకరాల్లో సాగుచేసేలా ప్రోత్సాహం
- 40 శాతం సబ్సిడీతో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సహించేందుకు ప్రణాళికలు
- ఆవిరితో ఉడకబెట్టే యూనిట్లు కూడా ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో సుగంధ పంటలు సాగుచేసే వారు అరుదుగా కనిపిస్తున్నారు. అక్కడక్కడా వీటిని సాగు చేస్తున్న రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం సుగంధ పంటల సాగు వైపు దృష్టి సారించి అరోమా మిషన్‌ను ఏర్పాటు చేసింది. 2016వ సంవత్సరంలో ఏర్పాటైన ఈ మిషన్ ఇప్పటికే రెండు ఫేజుల్లో రైతులను ప్రోత్సహిస్తూ వచ్చింది. ఈ సంవత్సరం నుంచి మూడో ఫేజ్‌లో రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రైతులు ఎంపిక ప్రక్రియ పూర్తయి పంటల సాగు వైపు అడుగులు వేశారు.



పామ్‌రోసా పంటలో రైతుతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, ఇతర అధికారులు

21 మంది రైతులు 128 ఎకరాల్లో సాగు:

అరోమా మిషన్ ద్వారా సుగంధ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఔత్సాహికులైన 21 మంది రైతులు ముందుకు వచ్చారు. జిల్లాలో మూడు రకాల పంటలను సాగు చేసేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం గడ్డిరకం జాతులను ఎంపిక చేసుకొని సాగు చేస్తున్నారు. అందులో భాగంగా «పామ్‌రోసా» పంటను సాగు చేయటానికి 8 మంది రైతులు ఆసక్తిని చూపారు. వారిలో బేస్తవారిపేట, గిద్దలూరు, అర్ధవీడు, మార్కాపురం మండలాల్లోని నాలుగు గ్రామాల్లోని రైతులు కలిసి 47 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. «లెమన్ గ్రాస్»ను 10 మంది రైతులు 56 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. చీమకుర్తి, పొదిలి, మార్కాపురం, పామూరు, సీఎస్‌పురం మండలాల్లోని రైతులు ఈ రకం పంట సాగు చేసేందుకు ముందుకు వచ్చారు. మూడో రకం «వట్టి వేరు» పంట. దీనిని కొత్తపట్నం మండలం పిన్నింటివారిపాలెం గ్రామంలో ముగ్గురు రైతులు 25 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

ఆవిరి ద్వారా ఉడకబెట్టే విధానం...

సుగంధ పంటలు సాగు చేస్తున్న రైతులే స్వయంగా పండించిన పంట నుంచి సుగంధం ముడి చమురు తీసే ప్రక్రియను కూడా అందిపుచ్చుకున్నారు. పంటలు సాగు చేస్తున్న గ్రామాల్లోనే ఆవిరి ద్వారా ఉడకబెట్టే ప్రక్రియ (డిస్టిలేషన్)తో ముడి సుగంధ ఆయిల్‌ను తీస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో అర టన్ను, ఒక టన్ను సామర్ధ్యంతో డిస్టిలేషన్ యూనిట్లను నెలకొల్పి ఉపాధి పొందుతున్నారు. ఈ డిస్టిలేషన్ యూనిట్‌కు ప్రభుత్వం మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ హార్టీకల్చర్ (ఎంఐడీహెచ్)పథకం ద్వారా 40 శాతం సబ్సిడీతో యూనిట్లను మంజూరు చేసి రైతులను ప్రోత్సహిస్తున్నారు.



లెమన్ గ్రాస్ పంటలో రైతుతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి

కష్టానికి తగిన ప్రతిఫలం...

సుగంధ పంటల సాగులో రైతులకు కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తోంది. ఎకరా 'పామ్‌రోసా' సాగు చేసేందుకు సుమారు రూ.40 నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరాకు 80 నుంచి 100 లీటర్ల ఆయిల్ ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో లీటరు పామ్‌రోసా ఆయిల్ రూ.1800 వరకు ఉంది. అంటే ఎకరాకు దాదాపు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు నికర ఆదాయ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అదేవిధంగా లెమన్ గ్రాస్ పంటకు సంబంధించి ఎకరాకు 140 నుంచి 150 లీటర్ల ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఎకరాకు సాగుకు దాదాపు రూ.45 వేల వరకు ఖర్చవుతోంది. బయట మార్కెట్‌లో లీటరు ముడి ఆయిల్ ధర రూ.850 పలుకుతోంది. ఒక్కో పంటకు నికరంగా రూ.60 నుంచి రూ.70 వేల వరకు ఆదాయం సమకూరుతోంది. వట్టివేరు పంటకు మంచి గిరాకీ ఉంది మార్కెట్‌లో. ఎకరాకు 2.50 టన్నుల మేర పంట దిగుబడి వస్తుంది. లీటరు ఆయిల్ ధర రూ.14 వేల ధర పలుకుతోంది. అలాకాకుండా వట్టివేరు గడ్డిని కూడా విడిగా కొనుగోలు చేసేవారు ఉన్నారు. బయట మార్కెట్‌లో టన్ను వట్టివేరు గడ్డి ధర రూ.1.05 లక్షలు పలుకుతోంది. అయితే పంట సాగు ఖర్చు రూ.1.50 లక్షల వరకు అవుతుంది. నికరంగా సంవత్సరానికి ఖర్చులు పోను రూ.1.25 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది.



ఆవిరి ద్వారా సుగంధం ముడిపదార్థాన్ని తీసే యూనిట్

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సహించేందుకు రంగం



సుగంధ పంటలను సాగు చేసే రైతులకు ఉపాధి పథకం ద్వారా ప్రోత్సహించేందుకు రంగం సిద్ధం చేశాం. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ సుగంధ పంటలు సాగు చేసే రైతులకు మంచి ప్రోత్సాహకాలు అందించనున్నారు. ఎంఐడీహెచ్ ద్వారా యూనిట్లు స్థాపించేందుకు 40 శాతం సబ్సిడీపై కూడా రుణాలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. జిల్లాలో వచ్చే నాలుగేళ్లలో మూడు వేల ఎకరాలకు మించి సాగు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అందుకు కలెక్టర్ ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

– వై.గోపీచంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

2011 నుంచి సుగంధ పంటల సాగు చేస్తున్నా



సుగంధ పంటలు 2011 నుంచే జిల్లాలో సాగు చేస్తున్నాను. తొలుత 'పామ్ రోసా' పంటతో పాటు లెమన్ గ్రాస్(నిమ్మగడ్డి) కూడా సాగు చేశాను. మధ్యలో 2014 నుంచి 2019 వరకు జిల్లాలో వర్షాలు లేకపోయేసరికి నెల్లూరు జిల్లాకు వెళ్లి పెన్నా నది కింద సుగంధ పంటలు సాగు చేశాను. తిరిగి 2020 నుంచి జిల్లాలో వర్షాలు సక్రమంగా పడుతుండటంతో కలగట్ల గ్రామంలోనే 'పామ్ రోసా' పంటను సాగు చేస్తున్నాను. ఇక్కడే ఆవిరి ద్వారా సుగంధం ముడి పదార్థాన్ని తీసే యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాను. బాగా లాభాలు వస్తున్నాయి. ఈ సంవత్సరం పెద్దమోతాదులో సుగంధ పంటల సాగు చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నాను.

– లక్కిరెడ్డి చెన్నారెడ్డి, రైతు, కలగట్ల, బేస్తవారిపేట మండలం

స్పందన అర్జీలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి

- సమస్యలు పునరావృతం కాకూడదు
- స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్



స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సకాలంలో చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా పనిచేసి సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం పట్ల ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా పనిచేయాలన్నారు. ఒకవేళ పరిష్కారం కాని సమస్యలుంటే కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి, లోకేశ్వరరావు, వరకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

■ పొన్నలూరు మండలం బైరెడ్డిపాలేనికి చెందిన బ్రహ్మయ్య డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తాను జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తి చేశానని, అయితే అందుకు సంబంధించిన నగదు జమ కాలేదని తెలిపారు. పరిశీలించి నగదును మంజూరు చేయాలని కోరాడు.

■ ఒంగోలు నగరం డివిజన్ కార్పొరేటర్ మలగ రమేష్ ఆధ్వర్యంలో క్లాపేటకు చెందిన వాసులు స్పందనలో కలెక్టర్‌ను కలిసి తమ ప్రాంతంలో మాంసాహారం తయారు చేసే కార్ఖానా ఉందని, దాని వలన వ్యర్థ పదార్థాలు ఆ ప్రాంతంలో పారవేయడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని ఫిర్యాదు చేశారు. కార్ఖానా చుట్టు పక్కల అన్నీ గృహాలు ఉండటంతో తీవ్రమైన దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు పెరిగి అనారోగ్యాల పాలవుతున్నారని, పరిశీలించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

■ పొదిలి మండలం కాటూరివారిపాలేనికి చెందిన నరశింహారావు తమ గ్రామంలో కరెంట్ స్తంభాలు డ్యామేజి అయ్యాయని, వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.

గొట్టిపడియవాసులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముంపు గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం టౌన్: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గొట్టిపడియ గ్రామం కూడా మునిగిపోతుందని, తమ గ్రామస్తులకు కూడా ఆర్‌ఆర్ ప్యాకే జీని ఇవ్వాలని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఒంగోలుకు వెళ్లి కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌ఈని కలిసినట్లు తెలిపారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సంధ్యారాణిల ఆధ్వర్యంలో నిర్వాసితులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. త్వరలో వెలిగొండ టన్నెల్ ద్వారా ప్రాజెక్టులోనికి 5 లేదా 6 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారని, ప్రధానంగా గొట్టిపడియ గ్యాప్ తమ ఊరివద్దనే ఉందని, కానీ అధికారులు మాత్రం ఆర్‌ఆర్ ప్యాకేజీని సుంకేశుల, అక్కచెరువు తాండ వాసులకు ఇవ్వాలని నిర్ణయించారని, ఇదే జరిగితే తామెక్కడికి వెళ్లాల్లో అర్థం కావడంలేదని, జరిగిన తప్పును సరిదిద్ది తమకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టులోనికి నీరు వదిలితే 60 శాతం పంట భూములు మునిగిపోతాయని, 30 శాతం భూములు లింకు కాలువలు తవ్వడం వలన నష్టపోయామన్నారు. మిగిలిన 10 శాతం భూమి పంటలకు అనువుగా లేదన్నారు. నీరు వదిలితే గ్రామానికి సరఫరా చేసే విద్యుత్ లైను, పొలాలు మునిగిపోతాయన్నారు. తమకెలాంటి జీవనాధారం లేదని, పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

తాగునీటి అవసరాలకు సాగర్ జలాలు

- 5 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు అంగీకారం
- 12 తేదీకల్లా జిల్లాలోకి ప్రవేశించనున్న సాగర్ నీరు
- నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా చెరువులు నింపుకోవాలని అధికారులకు ఆదేశం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు సబర్బన్: జిల్లా ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు సాగర్ జలాలను విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 6వ తేదీ నిర్వహించిన కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో తీర్మానం చేసినట్లు వెల్లడించారు. అందుకోసం ప్రకాశం, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని తాగునీటి చెరువులు నింపుకోవాలన్నారు. నాగార్జున సాగర్ నుంచి ఈ నెల 7వ తేదీన నీటిని విడుదల చేశారన్నారు. సాగర్ కుడి కాలువ ద్వారా 5 టీఎంసీలు విడుదలవుతాయన్నారు.

ప్రకాశం జిల్లా సరిహద్దు పుల్లలచెరువు మండలం మానేపల్లి వద్ద ఉన్న 85/3 వ మైలు వద్దకు ఈ నెల 12వ తేదీకి సాగర్ జలాలు చేరుకొని ప్రకాశం జిల్లాలోకి ప్రవేశిస్తాయని వెల్లడించారు. ఈ నీటి ద్వారా జిల్లాలోని మంచినీటి ఎద్దడి ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్, ఒంగోలు నగర పాలక సంస్థతో పాటు అన్ని మున్సిపాలిటీలు కూడా ఎస్‌ఎస్ ట్యాంకులకు నింపుకోవాలని సూచించారు. అన్ని తాగునీటి చెరువులను నింపుకోవాలన్నారు. సాగర్ నీటిని నింపుకునే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని మంత్రి హెచ్చరించారు. జిల్లా అధికారులు కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి అన్ని చెరువులను పూర్తి స్థాయిలో నింపుకునేలా చర్యల చేపట్టాలన్నారు. తాగునీటి చెరువుల్లో నీటిని నింపిన తరువాత ఆ నీటి వినియోగం విషయంలో కూడా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కనీసం మూడు, నాలుగు నెలల పాటు ఆ నీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

రేపు బేస్‌బాల్, కబడ్డీ సెలక్షన్స్

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 బాలబాలికల బేస్‌బాల్, కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బేస్‌బాల్, సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఎంపికలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు చీమకుర్తి పీఈటీ శ్రీనివాసరావు సెల్: 6300848788, సంతనూతలపాడు జెడ్పీహెచ్ఎస్ పీఈటీ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి సెల్: 9849118472 నంబర్లను సంప్రదించాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులతో పీఈటీ/పీడీలు ఆన్‌లైన్ ఎంట్రీ చేసుకుని, మాన్యువల్ ఎంట్రీఫారంతో వచ్చి ఎంపికలో పాల్గొనాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ పేర్కొన్నారు. అండర్ 17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జ్ఞాన భూమి చైల్డ్ ఐడీ నంబరు, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు ఎంపిక సమయంలో సమర్పించాలన్నారు.



సభలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, మద్దిశెట్టి వేణుగోపాల్, అన్నా రాంబాబు



సభలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌తో కనిగిరి మహిళా నేతలు



సభకు హాజరైన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మంత్రులు, ఎమ్మెల్యేలు

గెలుపు పిలుపు

రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు హాజరయ్యారు.



175/175 ప్లకార్డును చూపుతున్న ఒంగోలు నగర కార్పొరేటర్లు

క్లుప్తంగా

నాటుసారా కేసులో నిందితుడికి 30 నెలల జైలు

● రూ.4 లక్షల జరిమానా కూడా..

దర్శి: నాటుసారా తయారీ కేసులో నిందితుడు మేడం అరుణ్‌కుమార్‌కు 30 నెలల జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎమ్ కోర్టు మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు దర్శి సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.సుందరరామయ్య సోమవారం తెలిపారు. సెబ్ సీఐ కథనం మేరకు.. తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం గ్రామంలో 2021 మార్చి 13వ తేదీన 360 లీటర్ల నాటు సారా, 2700 లీటర్ల బెల్లం ఊటతో నిందితులు ఏ1 నాగుల్ మీరా, ఏ2 మేడం అరుణ్‌కుమార్ పట్టుబడ్డారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. అయితే ఏ1 నాగుల్ మీరా ఇప్పటికే మృతి చెందాడు. నిందితులపై నేరారోపణలు రుజువు ఏ2 అరుణ్‌కుమార్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి


మృతి చెందిన నగేష్

మార్కాపురం రూరల్: అతివేగం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడిపోయిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మార్కాపురం మండలం రాయవరం వద్ద రైల్వే వంతెనపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడిని దొనకొండ మండలం పడమటి వెంకటాపురం గ్రామానికి చెందిన కె.నగేష్(35)గా పోలీసులు గుర్తించారు. వ్యక్తిగత పనిపై మార్కాపురం వచ్చి తిరుగుప్రయాణంలో ఉండగా ఈ ప్రమాదం సంభవించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం


విజయ్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న మహిళలు


హాజరైన ప్రజలు

● వెయ్యి కిలోమీటర్ల పాదయాత్రలో పేదల బాధలు చూశా
● అట్టడుగు వర్గాలకు భూమి, యువతకు ఏటా రూ.10 వేల కోట్లు ఇవ్వాలి
● అధిక జన ఆకాంక్ష సదస్సులో రిటైర్డ్ ఐఏఎస్ విజయ్‌కుమార్

ఒంగోలు: అణగారిన వర్గాల అభ్యున్నతే ఐక్యతా విజయపథం యాత్ర లక్ష్యమని రిటైర్డ్ ఐఏఎస్ జీఏ స్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అద్దంకి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు జనంతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించిన అధిక జన ఆకాంక్ష సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పేదరికానికి కులం మతం తేడా లేదని, అది ఒక సామాజిక రుగ్మత అని పేర్కొన్నారు. సామాజిక రుగ్మతను రూపుమాపేందుకు మేధావులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ జనాభాలో ఎస్సీఎస్టీలు 27 శాతం మంది ఉండగా వారి అనుభవంలో ఉన్న భూమి కేవలం 2 శాతం మాత్రమేనని, ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉందన్నారు. తన పాదయాత్రలో ఎంతో మంది కన్నీటి వేదనను చూశానని, వారి సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నానన్నారు. పేదల ఆవాస ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు దీనాతి దీన స్థితిలో జీవించడం కంటే మంచి జీవితం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రామాయణం, మహాభారతం, భారత రాజ్యాంగం రాసిన వారంతా వెనుకబడిన వర్గాల వారేనని, మేధోబలం మెండుగా ఉన్న పేద వర్గాలు సంఘటితం కావాలన్నారు.

మీడియా తీరు బాగోలేదు

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాలో నైతిక విలువలు పడిపోతున్నాయని విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వార్తను వార్తగా ప్రచురించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. ఐక్యతా విజయపథం యాత్ర గురించి కనీసం ఒక్క వాక్యం కూడా రాయని మీడియా వ్యవస్థను చూస్తుంటే జర్నలిజంలో విలువలు ఏ స్థాయికి పడిపోయాయో అర్థమవుతోందన్నారు. మీడియా తమకు అనుకూలంగా ఉన్న వర్గాల వార్తలను మాత్రమే ప్రచురిస్తుంటే సమాజ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

ఒంగోలు డిక్లరేషన్ ప్రకటన

పాదయాత్రలో గుర్తించిన అంశాలపై ఒంగోలు డిక్లరేషన్ ప్రకటిస్తున్నానని విజయకుమార్ పేర్కొన్నారు. పేదలకు భూమి పంపిణీ, యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి పరిశ్రమల స్థాపనకు రూ.5 వేల కోట్లు, యువతకు వివిధ కార్పొరేషన్ల ద్వారా మరో రూ.5 వేల కోట్లు సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు ఏటా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజకీయ పదవులు లేకుండానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అనేక సంస్కరణలను, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించారని, అటువంటిది ఒక రిటైర్డ్ ఐఏఎస్‌గా తాను ఎందుకు ఇవ్వలేననే పట్టుదలే పాదయాత్రకు పునాది అని వివరించారు. సమావేశంలో విజయకుమార్ సతీమణి విజయశ్రీ, ఐక్యతా విజయపథం అధ్యక్షుడు గోపి, మల్లెల వెంకట్రావు, కత్తి కళ్యాణ్, కేఎల్ నరసింహారావు, నూకతోటి శరత్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన


ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెం ఈవీఎం గోదాములో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల యాక్సెప్టెన్సీ టెస్ట్(ఏపీటీ) ప్రక్రియను కలెక్టర్ దినేష్‌కుమార్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సోమవారం పరిశీలించారు. మంగళవారం నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బెల్ కంపెనీ నుంచి వచ్చిన ముగ్గురు సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో 80 మంది సచివాలయ సిబ్బంది, 40 మంది వీఆర్‌ఏలతో ఏపిటి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్‌ల పరిశీలన ఇప్పటికే పూర్తయిందని, బ్యాలెట్ యూనిట్‌లు వేగంగా పరిశీలన జరుగుతుందన్నారు. తయారీ లోపం ఉన్న వాటిని తిరిగి కంపెనీకి పంపిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఫస్ట్ లెవల్ చెకింగ్ చేపడతామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 121 ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

● వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశం

ఒంగోలు సబర్బన్: ఎస్పీ మలికాగర్గ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు జిల్లా నలుమూలల నుంచి 121 ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వయంగా ఎస్పీ ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో నేరుగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులను ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులను చట్ట ప్రకారం విచారణ చేసి పరిష్కరించాలన్నారు.

కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

● వివాహమై 20 రోజులే..
● శోకసంద్రంలో కుటుంబ సభ్యులు


మృతి చెందిన అజయ్‌కుమార్

బేస్తవారిపేట: తన సొంత టెంట్ హౌస్‌లో డీజే బాక్సులు, సీరియల్ లైటింగ్ సెట్‌కు మరమ్మతులు చేసుకుంటున్న యువకుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డాడు. ఈ విషాద సంఘటన సోమవారం బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పూసలపాడు గ్రామానికి చెందిన పూసలపాటి అజయ్‌కుమార్(21) జీవనోపాధి కోసం టెంట్ హౌస్ ఏర్పాటు చేసుకున్నాడు. వివాహాల సమయం కావడంతో డీజే బాక్సులు, సీరియల్ లైటింగ్ సెట్‌లు సక్రమంగా పనిచేసేలా మరమ్మతులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా అవుతున్న తీగను గమనించక కాలు మోపడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి రక్షించేలోపే మృతి చెందాడు. అజయ్‌కుమార్‌కు 20 రోజుల క్రితమే ఐశ్వర్య అనే యువతితో వివాహమైంది. చేతికందివచ్చిన కొడుకు కళ్ల ముందే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు శ్రీనివాసులు, సుబ్బలక్ష్మమ్మ శోకసంద్రంలో మునిగిపోయారు. భర్త అకాల మరణంతో తీవ్రంగా కలత చెందిన ఐశ్వర్య బోరున విలపిస్తోంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నరసింహారావు తెలిపారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

ఒంగోలు అర్బన్: కనిగిరిలో ఈ నెల 13న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం స్పందన భవనంలో ఆవిష్కరించారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయింట్, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో కనిగిరి డిగ్రీ కాలేజీలో ఉదయం 9 గంటల నుంచి 12 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, డీపీఓ నారాయణరెడ్డి, ఎంప్లాయిమెంట్ అధికారి టి. భరద్వాజ్, డీఏస్‌డీఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి యావజ్జీవ శిక్ష

ఒంగోలు: తీసుకున్న అప్పును తీర్చమన్నందుకు ఆగ్రహించిన వ్యక్తి స్నేహితుడని కూడా చూడకుండా దారుణంగా హతమార్చిన ఘటనలో నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఒంగోలు మండలం ముక్తినూతలపాడుకు చెందిన పంద్ర వేణు, ఒంగోలు గద్దలగుంటకు చెందిన గుంటూరు విజయ్‌కుమార్‌లు మంచి స్నేహితులు. అవసరార్థం వేణు తన స్నేహితుడైన విజయ్‌కుమార్ వద్ద రూ.8వేలు అప్పుతీసుకున్నాడు. తరువాత కొంతకాలానికి బాకీ గురించి విజయ్‌కుమార్ ఒత్తిడి తీసుకువస్తుండడంతో తట్టుకోలేకపోయిన వేణు పథకం పన్నాడు. అందులో భాగంగా తన బాబాయి సాతులూరి కృష్ణతో కలిసి విజయ్‌కుమార్‌ను బలవంతంగా మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని నాగులుప్పలపాడు మండలం చీర్వానుప్పలపాడు గ్రామంలోని పానకాల చెరువద్దకు తీసుకువెళ్లాడు. అక్కడ బండరాయితో మోది చంపేశారు. ఈ ఘటన 2014 మే 20న జరగ్గా..దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీటును కోర్టులో దాఖలు చేశారు. కేసును విచారించిన 8వ అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్న రాజా నేరం రుజువు అయినట్లు పేర్కొంటూ నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చావలి రమేష్‌బాబు, లైజన్ ఆఫీసర్‌గా శ్రీనివాస్‌లు వ్యవహరించారు.

మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శిరీష

మార్కాపురం: మార్కాపురంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శిరీష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఒంగోలు మెడికల్ కాలేజీలో ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ బదిలీపై మార్కాపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఒంగోలు రిమ్స్ ప్రిన్సిపాల్ మార్కాపురం మెడికల్ కాలేజీకి ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

కిక్ బాక్సింగ్‌లో పేస్ విద్యార్థికి స్వర్ణం


అబ్రహం నిక్సన్‌ను అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు సెంట్రల్: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో పేస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి అబ్రహం నిక్సన్ 60 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. పోటీలో విజేతగా నిలిచిన అబ్రహం నిక్సన్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ సోమవారం అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఏపీ కిక్ బాక్సింగ్ సెక్రటరీ విష్ణువర్ధన్, ఏఓ రమణబాబు, స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ వీరాంజనేయులు, ఎబీఏస్ విభాగాధిపతి సుధీర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కుస్తీలో క్విస్ విద్యార్థినికి గోల్డ్ మెడల్


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం

ఒంగోలు సెంట్రల్: విశాఖ జిల్లా చంద్రంపాలెంలో నిర్వహించిన 3వ ఏపీ జూనియర్, సీనియర్ పురుషులు, మహిళల అంతర్ జిల్లా కుస్తీ పోటీల్లో క్విస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని బార్గవి బంగారు పతకం సాధించింది. క్విస్ కాలేజీ ట్రిపుల్ ఈ సెకండియర్ చదువుతున్న భార్గవి.. కుస్తీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ అందుకుంది. ఈ సందర్భంగా ఆమెను సోమవారం కళాశాల వ్యవస్థాపక చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.గాయత్రిదేవి, ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు, హెచ్‌ఓడీ డాక్టర్ మౌళి అభినందించారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జరుగుమల్లి: రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఒంగోలులోని నెక్స్ జెన్ స్కూల్లో ఎస్.జి.ఎఫ్ జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఓపెన్ సైట్ అండర్-14 విభాగంలో ఆర్.లాస్య, సీహెచ్.నిక్షిత, ఎస్.విశ్వతేజ, కె.అస్మంత్, కె.తేజవర్ధన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వివరించారు. అండర్-17 విభాగంలో పి. అనూష, ఎం.సౌమ్య, ఎం.మహాలక్ష్మి, కె.నితీష్, అండర్-17 పిస్టల్ విభాగంలో ఎం.హాసిని ఎంపికయ్యారు. వీరు ఈ నెలలో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం తోపాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో 'ప్రకాశం' ప్రతిభ



స్కేటింగ్‌లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ శ్రీలక్ష్మి

జరుగుమల్లి: గుజరాత్ రాష్ట్రం బరోడాలోని గుజరాత్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో రోలర్ స్కీ స్నో బోర్డు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-12 కేటగిరీ 100 మీటర్ల విభాగంలో ఒంగోలుకు చెందిన పెద్ది హనీష్, సీనియర్స్ విభాగంలో బల్ల రామకృష్ణ స్వర్ణ పతకాలు, నాగిడి కార్తీక్ రజతం సాధించారని జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధి పి.సురేష్ రెడ్డి వెల్లడించారు. రోలర్ స్కీ స్నో బోర్డు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ మహమ్మద్ అర్షద్ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారని తెలిపారు. ఓవరాల్ చాంపియన్‌షిప్-2023ను ఆంధ్రప్రదేశ్ టీం కైవసం చేసుకోగా, హర్యానా ద్వితీయ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఆంధ్రా టీం, ప్రకాశం క్రీడాకారులను, ఏపీ స్కీ స్నో బోర్డు అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర ప్రసాద్, ఎం.సురేంద్రరెడ్డి, స్కేటింగ్ కోచ్ బల్ల శ్రీలక్ష్మి అభినందించారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ జట్టు ఎంపిక


జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ అనితా రోజ్‌రాణి

చీమకుర్తి: రాష్ట్రస్థాయిలో త్వరలో జరగనున్న త్రోబాల్ పోటీలకు జిల్లా తరఫున పాల్గొనే బాల బాలికల జట్లను వేర్వేరుగా సోమవారం ఎంపిక చేశారు. పేర్నమిట్ట జిల్లాపరిషత్ హైస్కూలులో జరిగిన పోటీలను డిప్యూటీ డీఈఓ అనితారోజ్‌రాణి ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో 68 హైస్కూళ్ల నుంచి 559 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 70 మంది వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జిల్లా తరపున అండర్-14, 17 విభాగాలలో బాల బాలికలు పాల్గొనే జట్లను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో జిల్లా తరపున పాల్గొనే జట్లను ఎంపిక చేసి వారిని అభినందించారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీల్లో బాల బాలికల జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. హైస్కూలు హెచ్‌ఎం పార్వతీశాంతి, ఎంఈఓ వెంకారెడ్డి, స్థానిక ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.


జిల్లా త్రోబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు